క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వాసుపల్లి గణేష్, ముత్తాబత్తుల రమేష్

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీలతో కలిసి 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్, వార్డు నాయకులు పచ్చిరిపల్లి రాము, పీపీఎస్ రెడ్డి సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. దక్షిణ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారులను ప్రోత్సహిద్దాం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు ఆయన చిత్రపటాన్ని బహూకరిస్తున్న పల్లా నవోజ్ఞ

మహారాణిపేట: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ ఆయన చిత్రాన్ని పెన్సిల్ స్కెచ్‌తో చిత్రీకరించి బహూకరించిన పల్లా నవోజ్ఞను అభినందించారు. మాధవ్ ఇంటికి సోమవారం బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ చిత్రకారిణి నవోజ్ఞను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాధవ్‌కు ఆయన చిత్రపటాన్ని నవోజ్ఞ అందజేశారు. మాధవ్ మాట్లాడుతూ ఔత్సాహిక చిత్రకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఫైన్ ఆర్ట్స్ అభివృద్ధికి ప్రభుత్వ కాలేజీలు సహకారం అందించాలన్నారు. ప్రతి ఏటా వేసవి శిక్షణ శిబిరంలో ఫైన్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నారని, అలా కాకుండా కళాశాలల్లో రెగ్యులర్ చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్,బిజెపి పార్టీ నాయకులు పల్లా జై భరత్ కుమార్, వాయునందనరావు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన జార్ఖండ్ వాసి



రోహితాస్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్, ఏయూటీడీ సభ్యులు

అల్లిపురం: మతిస్థిమితం కోల్పోయిన జార్ఖండ్ వాసి రోహితాస్‌ను ఏయుటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధులు అతడి గ్రామానికి తీసుకువెళ్లి అప్పగించారు. జార్ఖండ్ రాష్ట్రం, ఈస్ట్ సింగ్రోమ్ జిల్లా, మురుకటి గ్రామానికి చెందిన రోహితాస్ ఐటీఐలో డిప్లొమాతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివాడు. ఇతడికి తల్లి, సోదరుడు ఉన్నారు. అతడి సోదరుడు ఇచ్చిన సమాచారం మేరకు, అతిగా చదువుతూ ఉండటం వలన రోహిత్ మానసిక ఆరోగ్యం దెబ్బతింది. డబ్బు సంపాదించడం కోసం ఊరు వదిలి తిరుగుతూ వైజాగ్ వచ్చేశాడు. ఏయూటీడీ సిబ్బంది జనవరిలో అతడిని గుర్తించి, ఆశ్రయం కల్పించడంతో పాటు మందులు వాడించడంతో కొద్ది నెలల్లోనే పూర్తిగా కోలుకున్నాడు. శ్రద్ధ సోషల్ వర్కర్ ద్వారా వైజాగ్ నుంచి నేరుగా తీసుకువెళ్లి గ్రామంలో రోహిత్ సోదరుడు దయాసాగర్‌కు క్షేమంగా అప్పగించారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అమ్మవారి తిరువీధి



తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

అల్లిపురం: అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం శ్రీ రాచపోల మాంబ పండగ మహోత్సవాలు గత నెల 24 నుంచి ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పుట్టబంగారం తెచ్చే ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పుట్టింటి నుంచి అమ్మవారిని తీసుకుని తిరువీధి చేశారు. తప్పెటగుళ్లు, సాము గరిడీలతో అమ్మవారి తిరువీధి కుమ్మర వీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు మీదుగా తిరిగి అమ్మవారి సతకం పట్టుకు చేరుకుంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు దుర్గాలమ్మ తొలేళ్ల ఉత్సవం

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాలమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రయాణానికి పాట్లు



ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు క్యూ కట్టిన విద్యార్థులు

- నరిపడినన్ని బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు
- బస్టాపుల వద్ద తప్పని నిరీక్షణ
- వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు
- ఆటోలను ఆశ్రయిస్తున్న ఉద్యోగులు

డాబాగార్డెన్స్: నగరంలో సరిపడినన్ని ఆర్టీసీ బస్సులు లేకపోవడం.. ఉన్న బస్సులు జనంతో నిండిపోవడంతో ప్రయాణికులు నిత్యం సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా విద్యార్థులు బస్సుల్లో వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఉద్యోగులు, కార్మికులు, వివిధ పనుల నిమిత్తం నగరంలోకి వచ్చేవారు బస్సులు ఖాళీగా లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. సాయంత్రం 4 గంటలు దాటితే ఆశీలమెట్ట, ద్వారకానగర్ తదితర ప్రాంతాల మీదుగా ప్రయాణించే బస్సులు ఎక్కాలంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. ఆ సమయంలో బస్టాపుల్లో వందల సంఖ్యలో విద్యార్థులు నిరీక్షిస్తూ కనిపిస్తారు. వారిలో సగం మంది ఎక్కినా బస్సు కిక్కిరిసిపోవడమే. పాపం ఆ విద్యార్థులు.. అంత రద్దీలోనూ ప్రమాదకరమని తెలిసినా ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు బస్సుల్లో వేలాడుతూ ప్రయాణించాల్సిందే.

అరకొర బస్సులే..

సమయానికి బస్సులు రావు. వచ్చినవి కాస్త కిక్కిరిసి ఉంటున్నాయి. ఊపిరాడని బస్సుల్లో ప్రయాణం ప్రజలకు నరకప్రాయంగా మారింది. ఫుట్‌బోర్డ్ ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా ప్రత్యామ్నాయం లేక ప్రయాణిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో విద్యార్థులను బస్సుల్లో పంపిస్తున్న తల్లిదండ్రులు.. బిడ్డలు ఇంటికి వచ్చే వరకు ఆందోళనగా నిరీక్షిస్తున్నారు.



కాన్వెంట్ జంక్షన్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ఉద్యోగులు, కార్మికులు

ఇదీ పరిస్థితి..

నగరంలోని ఆశీలమెట్ట, ద్వారకానగర్, సీతంపేట పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పాఠశాలలు, కళాశాలలతోపాటు కోచింగ్ సెంటర్లు ఎక్కువ. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ఈ ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నాయి. నియోజకవర్గంలోని ద్వారకా బస్ స్టేషన్ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నలువైపులా, జగదాంబ జంక్షన్ మీదుగా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో విద్యార్థులు విద్యా సంస్థలకు వెళ్లాలన్నా.. ఉద్యోగులు పని ప్రాంతాలకు వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తారు. ఆ సమయంలో ట్రాఫిక్ కూడా ఎక్కువ కనుక బస్సుల రాకపోకలు దైవాదీనం. దీంతో అనుకున్న సమయానికి చేరాలంటే గంట ముందే బయల్దేరాల్సి వస్తోంది. బస్టాపుల్లో గంటల తరబడి నిరీక్షించి, కిక్కిరిసిన బస్సులో ఎలాగో ఎక్కి వేలాడుతూ వెళ్లాల్సిన పరిస్థితి. కొందరు ఆటోలను ఆశ్రయిస్తుండటంతో ఆర్టీసీ ఆదాయానికి ప్రత్యక్షంగా నష్టం వాటిల్లుతోంది. ఆర్టీసీ అధికారులు దృష్టి సారించి జనానికి సరిపడా బస్సులు నడపాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



ఇళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ బస్టాప్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

ఎక్కువ బస్సులు నడపాలి

నగరంలోని జనాభా దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులు ఎక్కువగా నడపాలి. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేటప్పుడు, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు బస్సులు ఎక్కువగా నడిపితే విద్యార్థుల అవస్థలు కాస్త తగ్గుతాయి. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎ.నిరంజన్, విద్యార్థి

‘ఉచిత విద్య’కూ ఫీజుల డిమాండ్



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు అందించి వస్తున్న తల్లిదండ్రులు

మహారాణిపేట: నగరంలో ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచిత సీట్లకు పలు కార్పొరేట్ స్కూళ్లు నిరాకరిస్తుండటం వివాదాస్పదంగా మారుతోంది. భాష్యం స్కూల్ యాజమాన్యం ఉచిత సీట్లలో చేరిన తమ పిల్లల ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తుండటంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అనేక మంది తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిసి కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల వైఖరిపై ఫిర్యాదు చేశారు. నగరంలోని భాష్యం, లిటిల్ ఏంజెల్స్, రామకృష్ణ తదితర పాఠశాలల్లో ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు తమకు ఫోన్ మెసేజ్ రావడంతో ఆ పాఠశాలల్లో చేర్చామని, ఇప్పుడు ఫీజు, పుస్తకాలు, ఇతర ఫండ్‌ల పేరిట డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కలెక్టర్‌కు వినతులు అందించిన వారిలో ఎస్.కిషోర్(నక్కవానిపాలెం), బి.సత్యనారాయణ(వెంకోజిపాలెం), పి.సుధాకర్(హనుమంతవాక), కృష్ణారావు(ఎన్‌ఏడీ కొత్తరోడ్డు), రామలక్ష్మి (బుచ్చిరాజుపాలెం) తదితరులు ఉన్నారు.

సీపీ కార్యాలయంలో కాంపాక్టర్ల ప్రారంభం

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ సిటీ స్పెషల్ బ్రాంచ్, సిటీ పోలీస్ కార్యాలయానికి హెచ్‌పీసీఎల్ యాజమాన్యం సీఎస్సార్ నిధులతో రెండు ఫైల్ ఆప్టిమైజర్స్(కాంపాక్టర్స్)ను అందజేసింది. వీటిని సోమవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చితో కలిసి ప్రారంభించారు. అనంతరం కాంపాక్టర్‌లోని గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ కాంపాక్టర్లు రికార్డులను భద్రంగా ఉంచడానికి, పాత రికార్డులను సులభంగా ట్రాక్‌చేయడానికి ఉపయోగపడతాయన్నారు. చిన్న స్థలంలో ఎక్కువ రికార్డులను క్రమబద్ధంగా ఉంచడానికి అనుకూలంగా ఉంటాయని చెప్పారు.



కాంపాక్టర్లను ప్రారంభించి గదిని పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత, సీపీ శంఖబ్రత బాగ్చి

స్పోర్ట్స్ ఎరీనా స్వాధీనానికి వినతి

డాబాగార్డెన్స్: ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను కాంట్రాక్టర్ నుంచి స్వాధీనం చేసుకోవాలని సీపీఎం ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కోరారు. సోమవారం మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా సుమారు రూ.25 కోట్లతో ఎంవీపీ కాలనీలోని ఎకరా 40 సెంట్లలో రెండంతస్తుల్లో ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా 2022లో నిర్మించారన్నారు. ఇందులో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్స్, ఆధునిక జిమ్, యోగా, చెస్ ఇలా అనేక రకాల సదుపాయాలున్నాయని వివరించారు. స్పోర్ట్స్ ఎరీనా ఆపరేషన్, మెయింటెనెన్స్, మేనేజ్‌మెంట్‌ను 2023 నుంచి ఐదేళ్ల పాటు కేకే కార్పొరేషన్ మొబి కేర్ అనే జాయింట్ వెంచర్ సంస్థకు ఏడాదికి కనీసంగా రూ.1,02,569 అద్దె చెల్లించేలా ఇచ్చారని, ఈ సంస్థ అద్దె చెల్లించడం లేదని, ఇప్పటి వరకు సుమారు రూ.2 కోట్లు బకాయి పడిందన్నారు. ఎరీనాకు వచ్చే పిల్లలు, పెద్దల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఆ సొమ్మంతా కాంట్రాక్టర్ సొంత ఖాతాలో వేసుకుంటున్నారన్నారు. జీవీఎంసీ పాఠశాలల పిల్లలను ఎరీనాలోకి రానివ్వడం లేదని, జీవీఎంసీ ఉద్యోగులకు 50 శాతం రాయితీ కూడా అమలు చేయడం లేదని చెప్పారు. తక్షణం లీజు బకాయి వసూలు చేసి కాంట్రాక్టర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. వచ్చే జీవీఎంసీ కౌన్సిల్‌లో దీనిపై ప్రత్యేక ఎజెండా పెట్టి తగు చర్యలు చేపట్టాలని మేయర్‌ను కోరారు.



మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

నష్టపరిహారం ఇప్పించండి

మహారాణిపేట: ఎల్జీ పాలిమర్స్‌లో గ్యాస్ లీక్ ఘటనలో నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఈ ఫిర్యాదును స్వీకరించకపోవడంతో బాధితులంతా కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో మొత్తం 186 మందికి సహాయం అందించాల్సి ఉందని, ఐదేళ్లు దాటుతున్న ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ఎంతో మందికి ఇచ్చారని, ఎల్జీ పాలిమర్స్ సమీపంలోని వెంకటాపురం తదితర గ్రామాల్లో నివసిస్తున్న తమకు ఇవ్వలేదని, తక్షణం ఇవ్వాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ మృతిచెందిన కుటుంబాలకు రూ.కోటి, గ్రామాల్లో ఉన్న వారికి రూ.10 వేల వంతున ఆర్థిక సాయం అందించారని, నేటి వరకు ఈ 186 మందికి ఎలాంటి సహాయం అందలేదని వాపోయారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్జీ పాలిమర్స్ బాధితులు

జోన్-4కు నాలుగు వినతులు

జగదాంబ: జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు స్వీకరించి మాట్లాడారు. యూసీడీ విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి 2, టౌన్ ప్లానింగ్‌కు 1 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, అధికారులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములు స్వాధీనం చేసుకోండి

బీచ్‌రోడ్డు: జీవో 596కు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేసిన 6 లక్షల ఎకరాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తిరిగి ఎస్సీలకే కేటాయించాలని విదసం(విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేశారు. అసైన్డ్ భూముల్లో అక్రమాలు సరిదిద్ది దళితులకు న్యాయం చేయాలని కోరుతూ విదసం నేతృత్వంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టారు. ఉమ్మడి విశాఖ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో దళిత శ్రేణులు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ 3 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు హక్కుదారుల పేర్లు, రికార్డులను మాయం చేసి కబ్జాకోరులు వారి పేరున ఫ్రీ హోల్డ్ చేసుకున్నారన్నారు. అటువంటి వారి నుంచి రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలని ప్రభుత్వంలోని కొందరు పెద్దలు సలహా ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. ఫ్రీ హోల్డ్ భూముల క్రయవిక్రయాలు ఒకే సామాజిక వర్గం మధ్యలో జరిగేలా జీవో సవరించాలన్నారు. శారదా పీఠం నుంచి వెనక్కి తీసుకున్న భూములను రామ్‌దేవ్ బాబాకు కేటాయించే ప్రతిపాదన మంచిదికాదని హితవు పలికారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో భూ కుంభకోణంపై టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు రెండు సిట్‌లు వేశాయని, అందులో 700 ఎకరాల అసైన్డ్ భూములతోపాటు 2 వేల ఎకరాల భూముల అక్రమాలు జరిగాయని సిట్ నివేదిక ఇస్తే.. ఏ ప్రభుత్వమూ చర్యలు తీసుకోలేదన్నారు. సభాధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ తెనాలిలో ముగ్గురు యువకులను పోలీసులు నడిరోడ్డు మీద చితక్కొట్టిన ఘటనపై ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బానాస నుంచి టి శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలోని మల్లం గ్రామంలో దళితవాడను వెలివేస్తే కనీసం కేసు నమోదు కాలేదని, వెంటనే ఈ దురాగతాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భీమ్ సేన ప్రతినిధులు కె.చిన్నారావు, తంటడి కిరణ్‌కుమార్, కొత్తపల్లి వెంకటరమణ, బాగం గోపాల్, మాటూరు శ్రీనివాసరావు, విదసం నేతలు సోడదాసి సుధాకర్, డి.నిర్మల, గుడివాడ ప్రసాద్, బూల భాస్కరరావు, టైసన్ రామారావు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విదసం నాయకులు

బీఎల్‌వోలకు శిక్షణ



శిక్షణ శిబిరానికి హాజరైన బీఎల్‌వోలు

మహారాణిపేట: వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ కోసం జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్ర అధికారుల(బీఎల్‌వో) శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. నాలుగు రోజుల పాటు వివిధ అంశాలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. విశాఖ దక్షిణ, తూర్పు, ఉత్తర, పశ్చిమ, భీమిలి, గాజువాక, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని బీఎల్‌వోలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన శిక్షణ శిబిరాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు లచ్చాపాత్రుడు, మధుసూదనరావు, డీటీ జిలానీ తదితరులు పాల్గొని పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఆర్పీలకు ట్యాబ్‌ల అందజేత

డాబాగార్డెన్స్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మెప్మా, జీవీఎంసీ ఆధ్వర్యంలో 50 మంది రిసోర్స్ పర్సన్స్‌కు కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి సోమవారం ట్యాబ్‌లు అందజేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ఆర్పీలు కీలకమన్నారు. అన్ని పథకాలు ప్రజలకు చేరవేసేందుకు పూర్తి వివరాలతో కూడిన ట్యాబ్‌ను వారికి అందజేశామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో 1048 మంది ఆర్పీలు పని చేస్తున్నారన్నారు. వారికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జీవీఎంసీ సంయుక్తంగా 1191 ట్యాబ్‌లను రూ.3.93 కోట్లతో కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ ట్యాబ్‌ల్లో లేటెస్ట్ టెక్నాలజీతో ప్రభుత్వ పథకాలన్నీ ఉంటాయని, వీటి ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి, జోనల్ ఏపీడీలు, సీవోలు, డీఎంసీ, ఆర్పీలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద సీఆర్పీల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్

మహారాణిపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్ సమాఖ్య పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమం అనంతరం 9 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. 13 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా వేతనాల విషయంలో వివక్షకు గురి అవుతూనే ఉన్నామని సమాఖ్య కో కన్వీనర్ పి.గణపతిరావు అన్నారు. తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, అద్దెబస్సు, కాల్ ఆన్ డ్రైవర్లకు ఒకేలా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ మాట్లాడుతూ 13 సమస్యలపై ప్రభుత్వానికి అనేక సార్లు వినతిపత్రం ఇచ్చామన్నారు. నేటికీ ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదన్నారు. ఆర్టీసీ సంస్థలో ఆరు నెలలకు ఒకసారి కార్మిక శాఖ ఇస్తున్న సర్క్యులర్‌ను విడుదల చేయాలని, దాని ప్రకారం కార్మికులకు జీతాలు ఇవ్వాలని కోరారు. ఇతర సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు.ర్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్
- నేడు ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’
- కార్యక్రమానికి హాజరు కావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుకు ఆహ్వానం

డాబాగార్డెన్స్: ప్రజలకు హామీలిచ్చి, వాటిని అమలు చేయని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారిని చైతన్యపరిచేందుకు చేపడుతున్న ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కోరారు. నియోజకవర్గంలో మంగళవారం చేపట్టనున్న కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజును ఆహ్వానించారు. మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించిన అనంతరం జగదాంబ జంక్షన్ వద్ద ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరగనున్న ‘బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ’ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వాసుపల్లిని, కేకే రాజును పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ అబద్ధాల చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయి నుంచి వార్డు స్థాయి వరకు విజయవంతంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని దక్షిణ నియోజకవర్గంలో వాడవాడలా ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కె.కె.రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్‌లను గజమాలతో సత్కరిస్తున్న నియోజకవర్గ శ్రేణులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ

మహారాణిపేట: జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కోరారు. సోమవారం శ్రీనుబాబు ఆధ్వర్యంలో పలు జర్నలిస్టుల సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ హరేంద్రప్రసాద్‌ను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఇతర జిల్లాల్లో జర్నలిస్టుల కోసం అమలు చేస్తున్న ఉత్తర్వులను కూడా ఆయనకు అందజేశారు. జర్నలిస్టులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని, దీనిపై ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే స్కూల్ ఫీజు రాయితీ ఉత్తర్వులు కూడా తక్షణమే అందజేయాలని డీఆర్‌వో భవాని శంకర్‌ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణ్, కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ఎస్. ప్రసాద్, బ్రాడ్‌కాస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

మహారాణిపేట: బీజేపీ వైద్య విభాగం, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మహారాణిపేటలోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రకృతి చికిత్సాలయానికి చెందిన డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, బీజేపీ మహారాణిపేట మండల అధ్యక్షుడు దేవర చంద్రశేఖర్, నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, నాయకులు తలాడ గిరిజ, మైనారిటీ మోర్చా నాయకులు సిహెచ్.రాజబాబు, సత్యనారాయణ, వై.ధోని, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.



ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు

కార్మికుల సమ్మె విజయవంతానికి పిలుపు

డాబాగార్డెన్స్: ఈ నెల 9న అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. జగదాంబ జంక్షన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు వస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుందని, అవి అమలు కాకుండానే పదేళ్ల నుంచి అనేక ప్రయోగాలు సాగుతున్నాయన్నారు. దానిలో భాగమే వివిధ కంపెనీల్లో కార్మికులంతా ఏర్పాటు చేసుకున్న యూనియన్‌ను రిజిస్టర్ చేయకుండా యాజమాన్యం, ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. లేబర్ కోడ్‌లో ప్రమాదకరమైనది సమ్మె హక్కును కాజేయడమేనన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మేజర్ పోర్టులోని అన్ని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ప్రధాన ఓడరేవులోని అన్ని పోర్టు, డాక్ కార్మికులకు ఎంఏసీపీ మంజూరు చేయడానికి బెంచ్‌మార్క్ తొలగించాలని తదితర డిమాండ్లు చేశారు. ఏఐటీయూసీ నాయకుడు పోతన్న, హెచ్ఎంఎస్ నాయకుడు జె.సూరిబాబు, సిటూ గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు, సత్యనారాయణ, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, సీఐటీయూ జాతీయ అధ్యక్షుడు కనకారావు, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు గొర్లె చందు పాల్గొన్నారు.

కనకరాజు మృతిపై విచారణ జరిపించాలి

మహారాణిపేట: తన సోదరుడి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని కనకరాజు సోదరి నాగజ్యోతి, ఇతర కుటుంబ సభ్యులు కోరారు. గీత్ సంగీత్ థియేటర్ వద్ద తీవ్ర గాయాలతో పడి ఉన్న కనకరాజును పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కనకరాజు మృతిచెందారు. దీంతో సోమవారం కేజీహెచ్ మార్చురీ వద్ద కనకరాజు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కనకరాజు సోదరి నాగజ్యోతి మీడియాతో మాట్లాడుతూ కనకరాజు ఒంటి మీద గాయాలు ఉన్నాయని, ఎవరో కనకరాజును కొట్టడం వల్ల చనిపోయారని పేర్కొన్నారు. తల వెనుక భాగంలో గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం అయిందని, దీనిపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



కేజీహెచ్ మార్చురీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కనకరాజు కుటుంబ సభ్యులు